# ప్రజాస్వామికంగానే జవాబు చెప్పండి

**ప్రశ్న: నక్సలైట్ సమస్యను ప్రభుత్వం ఏ రకంగా పరిష్కరించాలని మీరు భావిస్తున్నారు?**

జ : చాలాకాలం నుంచి మన దేశంలో ప్రభుత్వాలు నక్సలైట్ సమస్యను సామాజిక ఆర్థిక సమస్యగా గుర్తిస్తున్నాము, సామాజిక ఆర్థిక భూమిక ఉన్న రాజకీయ ఉద్యమంగా గుర్తిస్తున్నాము అని చెప్పడమే కాక దానికి తగ్గట్టుగా స్పందిస్తామని, రాజకీయ పరిష్కారం కోసం వెతుకుతున్నామని చెపుతూనే ఉన్నారు. 11వ ప్లానింగ్ కమిషన్ దీనిపై ఒక నిపుణుల కమిటీని కూడ వేసింది. దాంట్లో నేను కూడ ఒక సభ్యుడ్ని. మమ్మల్ని ఒక నివేదిక ఇమ్మని అడిగారు.

'పోలీసుల్ని, పారామిలటరీని ఉపయోగించి అణచివేసే ప్రయత్నం చెయ్యడం వలన నష్టమే ఎక్కువ జరిగింది. ప్రజల మీద చాలా హింస జరిగింది. ప్రభుత్వానికీ ప్రయోజనమేమీ రాలేదు. పోలీసులు చాలామంది చనిపోయారు. మావోయిస్టులూ చనిపోయారు. మరి ప్రత్యామ్నాయ మార్గమేమిటి? ప్రభుత్వం వాళ్లకు ప్రజాస్వామికంగా ఏ రకంగా జవాబు చెప్పాలి?' అని అడిగారు. ఒక వివరమైన నివేదిక ఇచ్చాం. అందులో మేము ప్రధానంగా చెప్పిందేమిటంటే ప్రజలకు మావోయిస్టుల వల్ల కొన్ని హక్కులు, కొంత రక్షణ, ఆత్మగౌరవం లభిస్తున్నాయి. వాటిని మీ రాజ్యాధికారాన్ని, చట్టాన్ని, రాజ్యాంగాన్ని ఉపయోగించి మీరే వాళ్లకు కల్పించండి. అదే ప్రజాస్వామిక మార్గం

అవుతుందని చెప్పాం. కాని ఈ ప్రభుత్వాలు అవి వినవు ఎందుకంటే ఒకటి - ఇవ్వాళ వాళ్ళు దేశ అభివృద్ధి కోసం అనుసరిస్తున్న వ్యూహాలకు ఇది ఆటంకం అవుతుంది. రెండవది - ఆ గ్రామీణ ప్రాంతాలలోని ఈ పాలక పార్టీల మనుషులు ఎవరు, వారి నాయకులు ఎవరు అనంటే అక్కడి ప్రజానీకానికి హక్కులు లేకపోవడం వల్ల బాగుపడుతున్నవారు, వారి హక్కులు హరించి బాగుపడుతున్న వాళ్ళు. కాబట్టి ఆ పనులు చేయాలనంటే తమ పార్టీ క్యాడర్‌నూ, స్థానిక నాయకులనూ వాళ్ళు వ్యతిరేకం చేసుకోవాల్సి ఉంటుంది. దానికి తెలుగుదేశం పార్టీ గానీ, కాంగ్రెస్ పార్టీ గానీ, బి.జె.పి గానీ, ఏ పార్టీ గానీ సిద్ధంగా ఉండదు. ఇవీ వాస్తవాలు. మేము హక్కుల సంఘాలుగా ప్రభుత్వాలకు ఇవ్వగల సలహా వారు ఆ ప్రజలకు చేస్తున్న మేలును మీరు మీ అధికారం ద్వారా చేయమని. కానీ మా నివేదికను పూర్తిగా పక్కన పెట్టి కోబ్రాల పేరుతో ఒక యాంటి నక్సలైట్ ఫోర్స్‌ను తయారు చేసి వారిని ఏరివేసే ప్రయత్నం ఛత్తీస్‌గఢ్‌లో మొదలుపెట్టారు.

**ప్రశ్న: మావోయిస్టులు అభివృద్ధిని నిరోధిస్తున్నారు అనే ఆరోపణ ఎంతవరకు నిజమంటారు?**

మావోయిస్టులకు నేనేమీ వకాల్తా పుచ్చుకోవడం లేదు గానీ ఈ ప్రశ్నను నేను 2006లో దంతేవాడ పోయినప్పుడు అక్కడి కలెక్టర్‌ను అడిగాను. 'మీరు చేసే అభివృద్ధికి మావోయిస్టులు అడ్డుపడుతున్నారు అంటున్నారు. మీరేమంటారు' అని అడిగితే 'మేము అంత అభివృద్ధేమీ చేయడం లేదు లెండి వాళ్ళు అడ్డుపడటానికి' అన్నారాయన. వాస్తవానికి మావోయిస్టుల మీద పెట్టవలసిన విమర్శలు రెండు ఉన్నాయి. ఒకటి, రోడ్లు ఉంటే పారా మిలటరీ వస్తుంది, పోలీసులు వస్తారని వాళ్ళు రోడ్లు తవ్వేశారు చాలా చోట్ల. తమ రక్షణ కోసం వాళ్ల చేసిన ఈ పని వలన ప్రజలకు నష్టం జరిగింది. రెండవది గ్రామీణ ప్రాంతాలలోని స్కూళ్ళు, సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను - ఎక్కువేమీ లేవు. అక్కడక్కడే ఉన్నాయి - పారామిలటరీ, పోలీసులు క్యాంపులుగా వాడుకుంటున్నారని వాటిని పేల్చేశారు. ఇవి రెండూ తప్పు. వీటిని తప్పనిసరిగా వ్యతిరేకించాలి.

అయితే అటువైపు నుంచి చూస్తే ప్రభుత్వం ఏమి అభివృద్ధి చేసిందని వీళ్ళు అడ్డు పడ్డారనే ఆరోపణ వేస్తున్నారు అనే ప్రశ్న వస్తుంది. ఛత్తీస్‌గఢ్‌లో అయినా, జార్ఖండ్‌లో అయినా, ఒరిస్సాలో అయినా, మన రాష్ట్రంలో అయినా ప్రభుత్వాలు ఆదివాసీ ప్రాంతాలలో గ్రామగ్రామానికి స్కూల్ కడతాం, రోడ్లు వేస్తాం, ఆసుపత్రులు

పెడతాం, యువకులకు శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పి పనులు మొదలుపెట్టి ఉంటే అది అభివృద్ధే. దానికి మావోయిస్టులు అడ్డుపడి ఉంటే మీరూ నేనూ ఏమీ అననక్కరలేదు, జనమే వాళ్ళను అక్కడి నుంచి తరిమివేస్తారు. అది జరగలేదు, ప్రభుత్వాలు ఆ పనులు చెయ్యలేదు. నిజానికి అక్కడ మావోయిస్టు ఉద్యమం మొదలయ్యేంతవరకు అభివృద్ధి చేస్తున్నామా లేదా అనే ప్రశ్న కూడ వాళ్లు వేసుకోలేదు. వాళ్ళకు పట్టణాలు సరిపోయాయి, పెద్ద పెద్ద నగరాలు సరిపోయాయి. గ్రామీణ ప్రాంతాలు, ముఖ్యంగా ఆదివాసీ ప్రాంతాలు వాళ్ళ లెక్కలోకి రాలేదు. వీళ్ళు వచ్చిన తరువాత వీళ్ళ మీద నింద వేయడానికి ఆ మాట అంటున్నారు. వీళ్ళ వైపు లోపాలు ఉన్నాయి, నేను కాదనడం లేదు గానీ, అభివృద్ధికి అడ్డుపడుతున్నారు అనేటువంటి నింద వేయడం మాత్రం సరయినది కాదు.

ప్రశ్న: **ఛత్తీస్‌గఢ్‌లో ఎన్.ఎం.డి.సి వేస్తున్న రోడ్లను మావోయిస్టులు ధ్వంసం చేశారు కదా!**

అప్పుడప్పుడు వాళ్ళ నిరసన కార్యక్రమాలలో భాగంగా ఎన్.ఎం.డి.సి వాళ్ల క్రేన్లవీ పేల్చేశారేమోగానీ ఇతరత్రా వాళ్లు అడ్డం పడిందేమీ లేదు. బైలదిల్లా గనులు నడుస్తూనే ఉన్నాయి. ఎన్.ఎం.డి.సి నడుస్తూనే ఉంది. నాల్కో వారి బాక్సైట్ పరిశ్రమా నడుస్తూనే ఉంది. భారీ పరిశ్రమలు వేటికీ వీళ్ళెప్పుడూ అడ్డుపడలేదు. ప్రభుత్వరంగ పరిశ్రమలే కాదు, ప్రైవేటు పెట్టుబడిదారుల కంపెనీలకు కూడ మావోయిస్టులు పెద్దగా అడ్డం రాలేదు. వాళ్ళు ప్రధానంగా దృష్టి పెట్టింధి గ్రామీణ ప్రాంతాలలో ఆదివాసులపైన అణచివేత ప్రయోగించే వాళ్ళ మీద. వాళ్ళను చంపడం గానీ, బెదిరించడం గానీ, తరిమివేయడం గానీ చేశారు. ఆదివాసీ గ్రామాలలో కమిటీలు వేసి వాళ్ళ గ్రామాలను వాళ్ళు చక్కదిద్దుకునేటట్టు చేశారు. కొన్ని చోట్ల చెరువులు తవ్వించారు. ఇటువంటి కొన్ని మంచి పనులు చేశారు. ముప్ఫై సంవత్సరాలుగా మేము మావోయిస్టులను చూస్తున్నాము. వాళ్ళు చేసే వాటిలో తప్పులు చాలా ఉండవచ్చును గానీ అట్టడుగు వర్గాల ప్రజానీకానికి ఒక ఆత్మస్థైర్యాన్ని కల్పించిన రాజకీయ ఉద్యమంగా మాత్రం దానిని గౌరవించాలి. వాళ్ళు పరిశ్రమలకు అడ్డు పడ్డారనడానికి బలమైన ఆధారాలు ఏమీ లేవు.

ప్రశ్న: **వారికి రాజకీయ మిత్రులు ఎందుకు లేరు?**

రాజకీయ మిత్రులు లేకుండా ఏమీ పోరు గానీ, ఆ విషయంలో వాళ్ళ మీద తరచుగా వచ్చే విమర్శ ఏమిటంటే - వాళ్ళు ఎంచుకున్నటువంటి పోరాట

మార్గం వలన ఎటాగూ కొందరు శత్రువులు - బడా పెట్టుబడిదారులో, భూస్వాములో, రాజకీయ నాయకులో - ఉంటారు. దానిని మించి వాళ్ళు తమ తొందరపాటు చర్యల వలన ఇంకా ఎక్కువ మందిని తయారు చేసుకున్నారనే విమర్శ ఉంది. ఉదాహరణకు చాలా సందర్భాలలో ఏమి జరుగుతూ ఉంటుందంటే ఒక ఆటంకాన్ని తొలగించుకునేటప్పుడు - కొడితే పోయేదానికి, చంపితే పోయేదానికి వేరే మార్గాలు ఎందుకు అనేటువంటి వైఖరిని వాళ్ళు ప్రదర్శిస్తూ ఉంటారు. వేరే రూపాలలో సమస్యను పరిష్కారం చేసుకోవాలంటే ఓపిక కావాలి. చాలా ప్రయత్నం కావాలి. తంతే, చంపితే సమస్య తీరిపోవచ్చు. అది తాత్కాలిక ఉపశమనాన్ని ఇస్తుందేమో గానీ మరింత మంది శత్రువులను తయారు చేస్తుంది. ఆ రకంగా వాళ్ళు అనవసరమైన శత్రువులను తయారు చేసుకున్నారేమోననే అభిప్రాయం కూడ ఉంది వాళ్ళ మీద.

**ప్రశ్న: కాంట్రాక్టర్లతో కుమ్మక్కయి రోడ్లు పేల్చివేస్తున్నారు అనే ఆరోపణ కూడ ఉంది. వ్యవస్థను వ్యతిరేకించే వారు వ్యవస్థలో భాగమైన కాంట్రాక్టర్లతో కుమ్మక్కు అవ్వడం ఎంతవరకు సమంజసం?**

వాళ్ళు చెప్పే జవాబు ఏమిటంటే మేము కుమ్మక్కు కావడం లేదు, కాంట్రాక్టర్ల డబ్బయినా గవర్నమెంటు డబ్బయినా ప్రజల సొమ్మే కాబట్టి ప్రజల కోసం మేము దాన్ని తీసుకుంటున్నాం, అది వాళ్ళు సృష్టించిన సంపద కాదు అని. కాంట్రాక్టర్ల దగ్గర డబ్బులు తీసుకొని వాళ్ళు వేసే రోడ్లను పేల్చేస్తే, మళ్ళీ వాళ్ళకు ఇంకొక కాంట్రాక్టు వస్తుందనే, ఆ రకమైన లాలూచీ వాళ్ల మధ్య ఉందని మేమేమీ అనుకోవడం లేదు. అయితే ఆ ప్రాంతాలలో బతికే కొంచెం చదువుకున్న వాళ్ళు, టీచర్లు చెప్పేటువంటి ఒక సీరియస్ అభియోగం ఏమిటంటే కొంతమంది బాగా డబ్బున్న వాళ్ళు చేసే అక్రమాలను, అవినీతిని మావోయిస్టులు గానీ, ఇతర నక్సలైట్ పార్టీలు గానీ ప్రశ్నించరు, ఎందుకంటే వాళ్ళకు ఫండ్ దొరుకుతుందని అంటారు. ఇది కొన్ని సందర్భాలలో వాస్తవికం అనిపిస్తుంది. కాని అదే పనిగా ఎవడో కాంట్రాక్టు తీసుకుంటాడు, వీళ్ళు రోడ్డు పేల్చేస్తారు, అతను మళ్ళీ కాంట్రాక్టు తీసుకుంటాడు అనే రకమైన లాలూచీ ఉందని నేనేమీ అనుకోవడం లేదు. బహుశా ఫండ్ ఇచ్చాడు కాబట్టి ప్రస్తుతానికి చూసీ చూడనట్టు పోదాం, భవిష్యత్తులో ఎప్పుడైనా చూసుకోవచ్చు అనే వైఖరి వాళ్ళలో ఉండి ఉండొచ్చు.

**ప్రశ్న: మావోయిస్టులు దేశ ఆంతరంగిక భద్రతకు ప్రధాన ప్రమాదమని ప్రభుత్వం అంటోంది కదా!**

ఈ మధ్య మన్మోహన్‌సింగ్, చిదంబరం పదే పదే ఆ అర్థరహితమైన ప్రకటన చేస్తున్నారు. దేశ ఆంతరంగిక భద్రతకు మావోయిస్టులే ప్రధాన శత్రువు అనడం నాన్‌సెన్స్. దేశ ఆంతరంగిక భద్రతకు ప్రధాన ప్రమాదం ఏదైనా ఉంటే అది దేశపాలకుల పాలనా నీతి. వాళ్ళు అసమానతలు పెంచుతున్నారు, పేదరికం పెంచుతున్నారు. దానివల్ల వచ్చేటువంటి ఆగ్రహం, దానివల్ల వచ్చేటువంటి అలజడులు - ఇవీ దేశ ఆంతరంగిక భద్రతకు ప్రధానమైనటువంటి ప్రమాదం. అంతే తప్ప మావోయిస్టులు ఆ రకమైనటువంటి ప్రమాదమని నేనేమీ అనుకోవడం లేదు. మావోయిస్టుల గురించి భిన్న అభిప్రాయాలు ఉంటాయి. వారిని పూర్తిగా మెచ్చుకునే వాళ్ళు ఉంటారు, పాక్షికంగా వాళ్ళను అభినందిస్తూ విమర్శించే వాళ్ళు ఉంటారు. ఏదేమైనా ఒక రాజకీయ ఉద్యమంగా వారిపై ఉండే విమర్శకు అర్థం ఉంది తప్ప ఆంతరంగిక భద్రతకు వాళ్ళే ప్రధానమైన ముప్పు అనేది పూర్తిగా అర్థరహితమైనటువంటి వైఖరి.

అయితే దీన్ని వాళ్లు పదే పదే ఎందుకు అంటున్నారు అంటే దీంట్లోని సామాజిక ఆర్థిక అంశాన్ని వాళ్ళు చూడదలచుకోలేదు కాబట్టి. దాన్ని వాళ్ళు ఒక రాజకీయ ఉద్యమంగా చూడదలచుకోలేదు కాబట్టి. అణచివేతనే ఏకైక విధానంగా వాళ్లు అనుసరించదలచుకున్నారు. దానికి సిద్ధాంతపరమైనటువంటి ఒక సమర్థన ఇవ్వాలనుకున్నారు. అది ఏమిటీ అనంటే ప్రధాన శత్రువు కాబట్టి వాళ్ళను అణచివేయడం తప్పనిసరి అనే పద్ధతిలో మాట్లాడుతున్నారు. ప్రభుత్వానికి కూడ బాగా తెలుసు తాము చెప్పేది వాస్తవం కాదని.

*29 సెప్టెంబర్ 2009*

*గ్రీన్‌హంట్ మీద 'లోకల్ టీవీ' కోసం అరుణారవికుమార్ చేసిన ఇంటర్వ్యూలో కొంత భాగం.*